సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 16 । సెప్టెంబర్ । 2023



నేటి నుంచి పెద్దదర్గాలో ఉరుసు

ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రం, ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతమైన కడప అమీన్‌పీర్ దర్గాలో శనివారం నుంచి సోమవారం వరకు ఉరుసు ఉత్సవాలు నిర్వహించనున్నారు. - IIలో



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కడప వేదికగా ఏసీఏ అండర్-19 పురుషుల అంతర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో కడప, రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్లు పోటీపడ్డాయి. - IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.98	రూ.120
రెండోరకం	రూ.56	రూ.94



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 392 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	-	565
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 23.50 కిలోలు

న్యూస్‌రీల్

జేసీఎస్ కో-ఆర్డినేటర్ల నియామకం

రాయచోటి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా జేసీఎస్ కో-ఆర్డినేటర్లుగా పి.సుకుమార్ రెడ్డి, కేతంరెడ్డి అమరనాథరెడ్డిలను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. కాగా, చిత్తూరు జిల్లా కో-ఆర్డినేటర్‌గా ఓబులవారిపల్లె మండలానికి చెందిన తల్లెం భరత్ కుమార్ రెడ్డిని, అనంతపురం జిల్లా కో-ఆర్డినేటర్‌గా నందలూరు మండలం టీవీపురంకు చెందిన బైనబోయిన గోపినాథ్ యాదవ్‌లను నియమించారు.

శ్రీ రెడ్డెమ్మకొండకు భూరి విరాళం

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన సంతాన దేవత శ్రీ రెడ్డెమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి వాల్మీకిపురం మండలం జమ్మన్లపల్లెకు చెందిన మొనపోటి రెడ్డెప్ప దంపతులు రూ.1,01,116 విరాళంగా అందజేశారు. శుక్రవారం ఆలయానికి చేరుకొన్న దాతలకు అర్చకులు, ఈవో మంజుల ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకపూజలు చేయించారు. అనంతరం ఆన్‌లైన్ ద్వారా వాల్మీకిపురం సప్తగిరి గ్రామీణ బ్యాంకులోని ఆలయ బ్యాంకు ఖాతాకు రూ, 1,01,116 జమచేశారు.

బీటెక్ ఫలితాలు విడుదల



పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న జేఎన్టీయూ ప్రిన్సిపల్, అధ్యాపకులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం బీటెక్ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను ప్రిన్సిపల్ వసుంధర, వైస్ ప్రిన్సిపల్ సూర్యనారాయణ రెడ్డిలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీటెక్ మొదటి సంవత్సరానికి ఈ నెల 8వ తేదీన, రెండో సంవత్సరానికి 11వ తేదీన పరీక్షలు పూర్తయ్యాయన్నారు. వీటి ఫలితాలను అతి కొద్ది సమయంలోనే విడుదల చేసినట్లు, ఇందుకు పరీక్ష కేంద్ర విభాగాధిపతులైన డా.ఎస్.హుస్సేన్‌వలి, డా.ఎస్.రాధాకృష్ణలను ప్రిన్సిపల్ అభినందించారు. పరీక్ష ఫలితాలు కళాశాల వెబ్‌సైట్‌లో విద్యార్థులు తెలుసుకోవచ్చన్నారు.

కుస్తీ పోటీలకు ఎంపిక



చంద్రవిశాలతో స్పెషల్ ఆఫీసర్, పీఈటీలు

వేముల : రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు వేములలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయ విద్యార్థిని చంద్రవిశాల ఎంపికైనట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ శారదమ్మ పేర్కొన్నారు. 10వ తరగతి చదువుతున్న చంద్రవిశాల అండర్-17 విభాగంలో విజయవాడలో ఈ నెల 21, 22, 23వ తేదీలలో జరిగే పోటీలలో పాల్గొంటుందన్నారు.

వైఎస్సార్ బీమాతో సత్వర న్యాయం

కడప రూరల్ : వైఎస్సార్ బీమా పాలసీదారుల నామినీ కుటుంబాలకు సత్వర న్యాయం చేకూరేలా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆనంద్‌నాయక్ తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పాలసీదారుల కుటుంబాలకు ఊరట లభించినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 2023-2024 ఏడాదికి సంబంధించి 2023 సెప్టెంబర్ 15వ తేదీ నాటికి ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున 20 మంది నామినీలకు డబ్బు మంజూరు చేసినట్లు తెలిపారు.

సబ్సిడీతో నూర్పిడి యంత్రాలు మంజూరు

కడప అగ్రికల్చర్ : వర్షాధారిత ప్రాంత అభివృద్ధి పథకం కింద వైఎస్సార్ జిల్లాకు సంబంధించి చిరుధాన్యాల నూర్పిడి యంత్రాలు(మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్స్) నాలుగు యూనిట్లు మంజూరైనట్లు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. ఇందులో ఒక్కో యూనిట్ రాయితీ కింద 2 లక్షలు లేదా 50 శాతం వరకు వర్తిస్తుందన్నారు. మొత్తం బడ్జెట్ 8 లక్షలు లక్ష్యంగా ఉందన్నారు. ఈ మిల్లెట్స్ యూనిట్స్‌కు సంబంధించి యంత్ర పరికరాలను రాయితీపై సరఫరా చేయడానికి ఆసక్తి ఉన్న ఏజెన్సీ వారు జిల్లా వ్యవసాయ కార్యాలయంలోని సహాయ వ్యవసాయ సహాయకులు(8331057289), వ్యవసాయ అధికారి (9849902188) నంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

కాపు నేస్తంతో కాంతులు



- నేడు లబ్ధిదారులకు డబ్బులు జమ
- నాలుగోవిడత 10,596 మందికి రూ. 15.89 కోట్లు

సాక్షి రాయచోటి : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి రెండు కళ్లుగా సర్కార్ అడుగులు వేస్తోంది. అణగారిన వర్గాలతోపాటు మిగిలిన వర్గాల్లోని మహిళలకు ఆర్థికసాయం అందించి అండగా నిలుస్తోంది. మహిళలు ఆర్థికంగా రాణించాలన్న సంకల్పంతో ప్రతి ఏడాది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులను విడుదల చేస్తున్నారు. ఇప్పటికే కాపు నేస్తం పథకం ద్వారా మహిళలకు రెండు విడతలుగా సొమ్ములు అందించిన రాష్ట్ర ప్రభుత్వం మరో విడత అందించేందుకు ఏర్పాట్లు చేసింది. కాపు నేస్తంతోపాటు డ్వాక్రా మహిళలకు వైఎస్సార్‌ఆసరా, సున్నావడ్డీ పథకాల ద్వారా సొమ్ములను అందిస్తూ అతివలు ఆర్థికాభివృద్ధి సాధించడంలో చేయూత అందిస్తోంది.

కాపుల సంక్షేమానికి పెద్దపీట

రాష్ట్ర ప్రభుత్వం కాపుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. ఎక్కడికక్కడ కాపు సామాజిక వర్గంలో అర్హులైన వారందరికీ ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ. 15 వేలు చొప్పున అందజేస్తోంది. ఇప్పటికే 2020-21లో తొలి విడతగా 8806 మందికి రూ. 13.20 కోట్లు అందజేశారు. రెండో విడతగా 2021-22లో 9158 మందికి రూ. 13.73 కోట్లు ప్రభుత్వం అందించింది. మూడవ విడతగా 2022-23కు సంబంధించి 10261 మందికి రూ. 15.39 కోట్లు అందజేశారు. ప్రతి ఏడాదికేడాదికి లబ్దిదారుల సంఖ్యతోపాటు మొత్తం కూడా పెరుగుతూ వస్తోంది. నాలుగు విడతలకు సంబంధించి 38,821 మందికిగాను రూ. 58.23 కోట్ల సొమ్మును కాపు నేస్తం ద్వారా మహిళలకు అందజేస్తున్నారు.

నేడు ఖాతాలకు నగదు జమ

కాపు నేస్తం పథకంలోని అర్హులైన వారికి శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా లబ్దిదారుల ఖాతాలకు నగదు జమ చేయనున్నారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు కేంద్రంగా ముఖ్యమంత్రి కాపు నేస్తం మహిళలకు సొమ్ములు విడుదల చేయనున్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి కలెక్టరేట్‌లోని వీసీ హాలులో ప్రజాప్రతినిదులు, జేసీ సమక్షంలో కార్యక్రమం నిర్వహించనున్నారు. అందుకు సంబంధించి బీసీ సంక్షేమశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది.

జిల్లాల్లో వైఎస్సార్ కాపు నేస్తం వివరాలు

సంవత్సరం	విడత	లబ్దిదారులు	మంజూరైన మొత్తం (రూ. కోట్లలో)
2020-21	మొదటి	8806	13.20
2021-22	రెండవ	9158	13.73
2022-23	మూడో	10,261	15.39
2023-24	నాలుగో	10,596	15.89
మొత్తం		38,821	58.23

నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గం	లబ్దిదారులు	అందజేసిన మొత్తం (రూ. కోట్లలో)
రైల్వేకోడూరు	8792	13.18
రాజంపేట	6391	95.86
రాయచోటి	4469	67.03
పీలేరు	4451	66.76
మదనపల్లె	6399	95.98
తంబళ్లపల్లె	8319	12.47

సద్వినియోగం చేసుకోవాలి



వైఎస్సార్ కాపు నేస్తం పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది క్రమం తప్పకుండా సరైన సమయంలోనే అందిస్తోంది. అర్హులైన వారు పెరుగుతుండడంతో అందుకు తగ్గట్టుగా మొత్తం సొమ్ములు కూడా పెరుగుతున్నాయి. ఒక్కొక్కరికి రూ. 15 వేలు చొప్పున ప్రభుత్వం కాపు నేస్తం పథకం ఆర్థిక సాయం అందజేస్తోంది. కాపు మహిళలు ప్రభుత్వం అందజేస్తున్న సొమ్ములను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలి.

– పీఎస్ గిరీషా, జిల్లా కలెక్టర్, రాయచోటి, అన్నమయ్య జిల్లా

అధిక దిగుబడుల సాధనకు కృషి చేయాలి

రాయచోటి : పంటలసాగులో ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించే దిశగా రైతులకు వ్యవసాయ అధికారులు సూచనలు చేయాలని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లా వ్యవసాయ సలహామండలి బోర్డు చైర్మన్ అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహామండలి, నీటి పారుదల సలహామండలి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ జేడీ చంద్రనాయక్, నీటిపారుదలశాఖ ఎస్ఈ కృష్ణమూర్తి, వ్యవసాయ సలహామండలి సభ్యులు బోడే షావలి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతు బాగుంటే సమాజం బాగుంటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం వ్యవసాయాభివృద్ధికి అధిక నిధులు ఖర్చు చేస్తుందన్నారు. ఈ దిశగా అధికారులందరూ పనిచేయాలన్నారు. జిల్లాలో 1.78 లక్షల ఎకరాల్లో ఈ-పంట నమోదు చేయాల్సి ఉండగా 1.70 లక్షల ఎకరాల్లో చేసినట్లు చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు 80శాతం సబ్సిడీతో 1335 క్వింటాళ్ల ఉలవలు పంపిణీ చేసినట్లు తెలిపారు.జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని, ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో ఇస్తున్న ప్రత్యామ్నాయ పంట విత్తనాలతో చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యత కల్పించాలని అధికారులకు సూచించారు. నీటిపారుదలశాఖ ఎస్ఈ కృష్ణమూర్తి మాట్లాడుతూ జూలై మాసంలో వెలిగల్లు రిజర్వాయర్ నుంచి ఎడమ.. కుడి కాలువలకు 55 కిలోమీటర్ల వరకు నీరు విడుదల చేసినట్లు చెప్పారు. దీంతో 30 చెరువులకు నీరు నింపామన్నారు. రైతులు చిరుధాన్యాలు సాగుచేసి నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు.

నివాళి : మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ముఖ్య అతిథులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వందశాతం ఈ-క్రాప్ నమోదు లక్ష్యం



కేవీపల్లెలో ఈ-క్రాప్ నమోదు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

కేవీపల్లె : రైతులు సాగు చేసిన పంటలను ఈ-క్రాప్‌లో వందశాతం నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి బి.చంద్రానాయక్ అన్నారు. శుక్రవారం కేవీపల్లెలో ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయాలని, తద్వారా రైతులకు ప్రభుత్వం నుంచి రాయితీలు, పరిహారం, బీమా వంటి బహుళ ప్రయోజనాలు వర్తిస్తాయన్నారు. అనంతరం రైతులకు 80 శాతం రాయితీతో ఉలవలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వై.వి.రమణరావు, ఏవో శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ జిల్లాకు మంత్రి ఆదిమూలం రాక

కడప సెవెన్‌రోడ్స్ : వైఎస్సార్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ శనివారం జిల్లాకు రానున్నారు. ఉదయం 7.00 గంటలకు రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. 7.10 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 7.20 గంటలకు ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 8.15 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 9.00 గంటలకు మైదుకూరుకు చేరుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. 10.00 గంటలకు వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. 10.30 గంటలకు అక్కడి 6వ వార్డులోని దర్గాను ప్రారంభిస్తారు. 11.30 గంటలకు మున్సిపల్ కార్యాలయ కొత్త భవనానికి ప్రారంభోత్సవం చేస్తారు. మధ్యాహ్నం 1.00 గంటకు రోడ్డు మార్గాన బయలుదేరి 4.00 గంటలకు మార్కాపురం చేరుకుంటారు.

రేపు గద్దర్ సంస్మరణ సభ



పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : వైఎస్సార్‌జిల్లా ప్రొద్దుటూరులో ఆదివారం ఉదయం 10 గంటలకు గద్దర్ సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కన్వీనర్ శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఇక్కడ కరపత్రాలు, పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్దర్ ప్రజా యుద్ధ నౌక అని, ఆయన పాట ఒక కెరటం అన్నారు. ఆయనతో పరిచయం ఉన్న కళాకారులు సంస్మరణ సభలో పాల్గొని తమ అనుభవాలను వివరిస్తారని తెలిపారు. విరసం సభ్యురాలు వరలక్ష్మి, చైతన్యమహిళా సంఘం కన్వీనర్ ప ద్మ, ప్రజానాట్య మండలి స్టేట్ కౌన్సిల్ మెంబర్ ప ల్లవోలు రమణ, మాలమహానాడు రాష్ట్ర గౌరవాధ్య క్షుడు మురళీప్రసాద్, దళిత సమాఖ్య నాయకుడు య ల్లయ్య,బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జయరాం పాల్గొన్నారు.

ముగిసిన క్లెయిమ్‌ల స్వీకరణ

కడప సెవెన్‌రోడ్స్ : ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 కార్యక్రమంలో భాగంగా క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసింది. వైఎస్సార్ జిల్లాలో ప్రజల నుంచి ఓటర్ల నమోదు, అభ్యంతరాలు, సవరణలకు సబంధించి మొత్తం 2,19,279 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో శుక్రవారం నాటికి 1,74,529 పరిష్కరించారు. ఇక 44,750 పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని కూడా పరిష్కరించి ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేయనున్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్దేశించిన విధంగా ముసాయిదా జాబితా విడుదల చేశాక కూడా ఎవరికైనా అభ్యంతరాలుంటే దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికీ జిల్లాలో ఎవరైనా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోకపోయినా నిరంతర నమోదు ప్రక్రియలో వారికి అవకాశం ఉంటుందని, దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని అధికారులు అంటున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే 'జగనన్నకు చెబుదాం'

జేసీ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె : ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'జగనన్నకు చెబుదాం'కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం కేవీపల్లె ఎంపీడీవో కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై హెల్ప్ డెస్క్ నంబబర్ 1902కు ఫోన్ చేయాలని కోరారు. స్పందన కార్యక్రమం తరహాలో ప్రతి బుధవారం, శుక్రవారం ‘జగనన్నకు చెబుదాం’కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిని వందశాతం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు చిన్న చిన్న సమస్యలపై కాకుండా తమకు ఇబ్బందిగా ఉన్న వ్యక్తిగత, సామాజిక సమస్యలపై ఫిర్యాదులు, వినతులు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు పారదర్శక పాలన అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. అలాగే ప్రజారోగ్యం పట్ల ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే కార్యక్రమం, అనంతరం ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కేవీపల్లె మండలంలో ఎక్కువగా భూసమస్యలపై ఫిర్యాదులు అందుతున్నాయని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం భూసమస్యలు, ఆన్‌లైన్ సమస్యలు, రోడ్డు సమస్యలు, ఎన్ఈజీఎస్ బిల్లులు తదితర సమస్యలపై 113 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రంగస్వామి, ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి, వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ సతీష్‌రెడ్డి, నాయకులు గజ్జెల శీన్‌రెడ్డి, సి.కె. యర్రమరెడ్డి, మోహన్‌రెడ్డి, చిన్నయర్రమరెడ్డి, పి. ద్వారకనాథెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ చేద్దాం రండి

- పదిహేను రోజులుగా నమోదుకాని నామినేషన్లు
- సెప్టెంబర్ చివరి వరకు గడువు పెంపు



ప్రదర్శనకు వచ్చిన ప్రాజెక్టులతో విద్యార్థినులు (ఫైల్)

జిల్లా ప్రదర్శనకు గతంలో ఎంపికైన నామినేషన్ల వివరాలు ఇలా..

సంవత్సరం	జిల్లాలో ప్రదర్శించిన ప్రాజెక్టులు	రాష్ట్రస్థాయికి ఎంపికైనవి	జాతీయ స్థాయికి ఎంపికైనవి
2015-16	720	72	04
2016-17	784	78	08
2017-18	496	49	07
2018-19	362	36	03
2019-20	483	48	05
2020-21	335	34	03
2021-22	351	35	01
2022-23	276	–	–

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులను భావి భారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఇన్‌స్పైర్ మనాక్‌కు జిల్లాలో స్పందన తక్కువగా ఉంది. అధికారులు ఎప్పటికప్పుడు సూచనలిస్తున్నా చాలా పాఠశాలల నుంచి నామినేషన్లు పూర్తిస్థాయిలో పంపడం లేదు. అందరూ ఒక్కసారిగా నామినేషన్లు పంపడం ప్రారంభిస్తే సర్వర్ మొరాయించే అవకాశం ఉందని చెబుతున్నా.. చాలా మంది తమ లక్ష్యాలను అధిగమించడం లేదు.

- జిల్లా వ్యాప్తంగా 1243 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉండగా 2224 నామినేషన్లు మాత్రమే వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో 627 ప్రైవేటు పాఠశాలలు ఉండగా 98 పాఠశాలల నుంచే మాత్రమే నామినేషన్లు వచ్చాయి. మిగిలిన పాఠశాలలనుంచి అరకొరగా పంపారు. గడువు పెంచడంతో మరింత చొరవచూపి ఎక్కువ నామినేషన్లు పంపేలా చూడాల్సి ఉంది. అన్ని పాఠశాలలకు అవకాశం ఉన్నప్పటికీ ఉపాధ్యాయులు చొరవ చూపడం లేదు. ప్రభుత్వం ఈ నెల చివరి వరకు గడువు పొడగించినా గత పది రోజులుగా ఒక్క నామినేషన్ రాలేదు.

జాతీయ స్థాయి పోటీల వరకు...

6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఇన్‌స్పైర్ మనాక్‌కు నామినేషన్లు పంపవచ్చు. తమ సైన్సు ఉపాధ్యాయుడి సహకారంతో మేధోశక్తిని రంగరించి డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండి యా, స్వచ్ఛ భారత్, మేక్ ఇన్ ఇండియా, సమాజాభివృద్ధి, క్లీన్ ఇండియా అంశాల ఆధారంగా ప్రాజెక్టులు రూపొందించి ఆ వివరాలు డ్రాఫ్ట్ రూపంలో ఇన్‌స్పైర్ మనాక్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. వారు పరిశీలించి మంచి ఆలోచనలతో కూడిన ప్రా జెక్టు జిల్లాకు ఎంపిక చేస్తారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారికి రాష్ట్రస్థాయిలో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తారు. జాతీయ స్థాయికి ఎంపికై న విద్యా ర్థులను బాలశాస్త్రవేత్తలుగా గుర్తించి రాష్ట్రపతి చేతు ల మీదుగా పురస్కారం అందిస్తారు. పిల్లల ప్రాజెక్టు జిల్లా స్థాయికి ఎంపికైతే రూ.10 వేలు, రాష్ట్రస్థాయికి ఎంపికైతే రూ.40వేలు, జాతీయ స్థాయికి ఎంపికై తే రూ.60వేలు విద్యార్థి ఖాతాకు జమచేస్తారు.

ఈ నెలాఖరు వరకు గడువు



ఇన్‌స్పైర్ మనాక్‌కు సంబంధించి నామినేషన్ల స్వీకరణకు ప్రభుత్వం ఈ నెల చివరి వరకు గడువు పొడిగించింది. నాలుగు వేల నామినేషన్లకుగానూ ఇప్పటి వరకు 2224 నామినేషన్లు వచ్చాయి. గడువు పొడగించినప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్క నామినేషన్ రాలేదు. ప్రైవేటు యాజమాన్యంతోపాటు ప్రభుత్వ పాఠశాలల యాజమాన్యాలు స్పందించాలి.

– మహేశ్వరెడ్డి, జిల్లా సైన్సు అధికారి

అందరూ స్పందించాలి



ఇన్‌స్పైర్ మనాక్ నామినేషన్లకు సంబంధించి అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు స్పందించాలి. సైన్సు ఉపాధ్యాయులు బాధ్యత తీసుకుని నామినేషన్లను త్వరితిగతిన పూర్తిచేయాలి. ప్రతి పాఠశాల నుంచి తప్పనిసరిగా ఐదు నామినేషన్లు వచ్చేలా చూడాలి. ఇందులో నిర్లక్ష్యం చేస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు.

– ఎద్దుల రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

17న జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

మదనపల్లె సిటీ : జిల్లా పురుషుల ఫుట్‌బాల్ జట్టు ఎంపికను ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు దిలీప్, సాగర్, మురళీధర్‌లు తెలిపారు. మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉదయం 8 గంటలకు ఎంపికలు జరుగుతాయన్నారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్టు 22, 23 తేదీల్లో నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9502074146 నంబరులో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

గువ్వలచెరువులో చిరుతపులి సంచారం?

రామాపురం : మండల పరిధి గువ్వలచెరువు తూర్పు భాగంలోని పాలకొండల నుంచి జాతీయ రహదారిపైకి చిరుత పులి రెండు రోజులుగా సంచరిస్తోందని అలజడి రేగింది. గురువారం రాత్రి కడప నుంచి ద్విచక్ర వాహనంలో వెళ్తున్న వారు గువ్వలచెరువులోకి చేరుకొని విషయాన్ని చెప్పారని గ్రామస్తులు తెలిపారు. గత నెల రోజుల నుంచి చిరుతపులి గువ్వల చెరువు వద్ద మొదటి, రెండవ మలుపులలో సంచరిస్తున్నట్లు ప్రయాణికులు తెలియజేస్తున్నా అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపించారు. ఈ విషయంపై ఫారెస్టు అధికారి రెడ్డప్పను వివరణ కోరగా.. ఈ విషయం శుక్రవారం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. గువ్వలచెరువు పరిసర ప్రాంతాలలో పర్యటించి వాస్తవాలను కనుగొంటామన్నారు. ప్రజలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు.

రాజంపేట డీఎఫ్ఓపై చర్యలు తీసుకోవాలి

రాయచోటి అర్బన్ : తమ సంఘం నేతలపై అక్రమ కేసులు బనాయించిన రాజంపేట డీఎఫ్ఓ వివేక్‌పై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీ గిరిజన సమాఖ్య అన్నమయ్య జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు అంజి,శేఖర్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. షికారుపాళెంకు చెందిన గిరిజనులకు అటవీభూములను పంపిణీ చేయాలంటూ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో రెండేళ్లుగా ఉద్యమిస్తున్నామన్నారు. ఈ విషయమై రెండు రోజుల క్రితం కలెక్టరేట్ వద్ద జరిగిన నిరసన ప్రదర్శనలో డీఎఫ్ఓ వివేక్‌ను గట్టిగా ప్రశ్నించడం జరిగిందన్నారు. ఆయనపై ఎవరూ ఎలాంటి దౌర్జన్యం చేయడం, బెదిరింపులకు పాల్పడడం జరగలేదంటూ చెప్పారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జిల్లా ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. తీవ్ర అనారోగ్యంతో అతన్ని 108 అంబులెన్స్ సిబ్బంది గురువారం జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో ఆరోగ్యం క్షీణించడంతో శుక్రవారం మృతి చెందినట్లు ఆస్పత్రి అధికారులు తెలిపారు. మృతుడికి సుమారు 50 ఏళ్లు ఉంటాయని వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ఔట్‌పోస్టులో సంప్రదించాలని మార్చురీ ఇన్‌చార్జి తేజా తెలిపారు.

ఒంటిమిట్టలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ



సీతారామలక్ష్మణులకు పూజలు చేస్తున్న వేదపండితులు



పుట్టమన్ను తీసుకువస్తున్న అర్చకులు, అధికారులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట కోదండ రామాలయంలో శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు వీణారాఘవాచార్యులు మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఆలయ టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్ బాబు సమక్షంలో పూజలు జరిగాయి. రంగమండపంలో సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, పుష్పమాలికలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. సభా అనుజ్ఞ, విష్వక్సేన ఆరాధన, వాసుదాసు పుణ్యాహవాచకం, రక్షాబంధనం, ఆచార్య రుత్విక్ వరణం, పవిత్ర పుట్ట మన్ను సమర్పణ, అంకురార్పణ, వాస్తుహోమం, సోమకుంభ ప్రతిష్ట, కలశారాధన, నివేదన, సేవాకాలం, తీర్థ ప్రసాద వినియోగం కార్యక్రమాలు వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాశరథి సన్నిధిలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఈ సందర్భంగా డిప్యూటీ ఈవో నటేష్ బాబు మాట్లాడుతూ శనివారం, ఆదివారం, సోమవారం మూడు రోజుల పాటు రామయ్య క్షేత్రంలో ప్రత్యేకంగా హోమాలు నిర్వహిస్తామని చెప్పారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి నెల సరి హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. డిప్యూటీ ఈవో నటేష్ బాబు సమక్షంలో ఆలయ రంగమండపంలో ఈ హుండీ లెక్కింపు జరిగింది. హుండీ ఆదాయం రూ.9 లక్షల 29 వేల 171 వచ్చినట్లు డిప్యూటీ ఈవో తెలిపారు.

నేటి నుంచి పెద్దదర్గాలో ఉరుసు



విద్యుద్దీపాల అలంకరణలో పెద్దదర్గా

కడప కల్చరల్ : ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రం, ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతమైన కడప అమీన్‌పీర్ దర్గాలో శనివారం నుంచి సోమవారం వరకు హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా అమీనుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిష్టివుల్ ఖాద్రీ సాహెబ్ ఉరుసు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శనివారం గంధం, ఆదివారం ఉరుసు, ఖవ్వాలీ కచేరి, సోమవారం తహలీల్ ఫాతెహా నిర్వహిస్తారు.

గురువుల సన్నిధిలో..

ప్రస్తుతం హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా అమీనుల్లా మాలిక్ సాహెబ్ ఉరుసు నిర్వహిస్తున్నారు. ఆయన ప్రస్తుత పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ తండ్రి అనే విషయం తెలిసిందే. ఆయన 10వ పీఠాధిపతిగా దర్గా పేరు ప్రఖ్యాతులు ఇనుమడించేలా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన 1993లో కాలం చేసిన అనంతరం ప్రస్తుతం హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా మాలిక్ సాహెబ్ 11వ పీఠాధిపతిగా వ్యవహరిస్తున్నారు. దర్గాలో ప్రధాన గురువులు జీవ సమాధి పొందిన హజరత్ పీరుల్లామాలిక్ సాహెబ్ మజార్ ఉంది. ఇతర గురువుల మజార్లు ఉన్న భవనంలో తూర్పు వైపున హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా అమీనుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిష్టివుల్ ఖాద్రీ సాహెబ్ మజార్ ఉంది. దర్గాకు వచ్చే భక్తులు తొలుత ప్రధాన గురువుల మజార్‌ను దర్శించుకున్నాక ప్రత్యేకంగా హజరత్ అమీనుల్లా సాహెబ్ మజార్ వద్ద కొద్దిసేపు ధ్యానం వహిస్తారు. ఈ సందర్భంగా మనసులో తమ సమస్యను పరిష్కరించాలని కోరుకుంటే తప్పక నెరవేరుతాయని భక్తుల్లో గాఢమైన విశ్వాసం ఉంది. ప్రస్తుతం ఆయన పేరిటే మూడు రోజులపాటు ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం నాటికే భక్తులు పెద్ద ఎత్తున దర్గాకు చేరుకున్నారు. నిర్వాహకులు వారికి అన్ని వసతులు కల్పించారు. ఉరుసు సందర్భంగా దర్గాను పూర్తిగా రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.

ఎర్రగుంట్ల నుంచి ఇస్రోకు ఎదగడం గర్వకారణం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్లలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదివిన ఎస్.మహబూబ్‌బాషా ఇస్రోలో పని చేస్తూ చంద్రయాన్-3లో భాగస్వామ్యం కావడం గర్వకారణంగా ఉందని హెచ్ఎం రామాంజనేయరెడ్డి తెలిపారు. శుక్రవారం ఇస్రో శాస్త్రవేత్త మహబూబ్‌బాషాను పాఠశాలలో ఉపాధ్యాయ బృందం సత్కరించి జీఎస్ఎల్‌వీ మోడల్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి, ఇస్రో శాస్త్రవేత్త మహబూబ్‌బాషా మాట్లాడుతూ ఎర్రగుంట్ల పట్టణంలో 2004లో పదో తరగతి, ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా (ఈఈఈ కోర్సు), వాకాడలో బీటెక్ చదివినట్లు తెలిపారు. తర్వాత రిక్రూట్‌మెంట్‌లో ఇస్రోలో 2009-10లో చేరినట్లు పేర్కొన్నారు. అక్కడ సీఎంజీ విభాగంలో రాకెట్ లిఫ్ట్‌లో ఎలక్ట్రికల్‌లో సైంటిస్టుగా పని చేస్తున్నట్లు చెప్పారు. చంద్రయాన్-3లో పాల్గొనడం ఎంతో సంతోషకరమని, నా జీవితంలో మరిచిపోలేని సంఘటన అని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నలుగురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డారు. మదనపల్లె పట్టణం రెడ్డీస్ కాలనీకి చెందిన ఓ మైనర్ బాలిక (18), కురబలకోట మండలం ముదివేడు పంచాయతీ సాయిబులపల్లెకు చెందిన మైనర్ బాలిక (18) కళాశాలకు సక్రమంగా వెళ్లకుండా ఎక్కువ సమయం సెల్‌ఫోన్‌లో గడుపుతూ చదువును నిర్లక్ష్యం చేయడంతో వారిని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన వారు వారి ఇళ్లలోనే రాత్రి పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పట్టణంలోని ఎస్టేట్ ప్రాంతం శివాజీనగర్‌కు చెందిన మల్లికార్జున భార్య రేణుక (38) కుటుంబ సమస్యలతో భర్తతో గొడవపడి, ఇంట్లో ఉన్న బాడీ స్ప్రే తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. రామసముద్రం మండలం చెంబకూరు పంచాయతీ కత్తివారిపల్లెకు చెందిన శ్రీనివాసులు భార్య ఎం.సుజాత(25) ఇంటిలోనే పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. వారు స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

రాయచోటి టౌన్ : డ్రంకన్ డ్రైవ్ కేసులో నిందితుడికి మూడు రోజులు జైలు శిక్ష విధిస్తూ ఏజేఎఫ్‌సీఎం న్యాయమూర్తి ఎస్ఎంటీకే శారద తీర్పు చెప్పారు. శుక్రవారం రాయచోటి ట్రాఫిక్ పోలీసులు రాయచోటి ప్రధాన కూడళ్లలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. రాయచోటి రూరల్ పరిధిలోని పెమ్మాడపల్లె గ్రామం గరుగుపల్లెకు చెందిన పల్లపు ఆంజనేయులు మద్యం సేవించి స్కూటర్ నడుపుతుండగా పట్టుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి మూడు రోజులు జైలు శిక్షను విధిస్తూ తీర్పు చెప్పారు.

ఆర్టీసీ పురోభివృద్ధికి కృషి చేయాలి



ఆర్టీసీ సిబ్బందికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డీపీటీఓ రాము

మదనపల్లె సిటీ : ఆర్టీసీ పురోభివృద్ధికి కష్టపడి పని చేయాలని జిల్లా ప్రజారవాణాధికారి రాము అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ-2 డిపో ప్రధాన గేట్ వద్ద సిబ్బందితో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి క్యాష్ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వీసులు ఆపరేట్ చేయడంలో డిపో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో డీఎం ఆర్‌సీ నిరంజన్, సీఐ గీత, సిబ్బంది పాల్గొన్నారు. ఈపీకేలో అత్యధికంగా తెచ్చిన డ్రైవర్ శంకర్, కండక్టర్లు పీఎస్ ఖాన్, ఆర్.కె. కుమార్, కేఎంపీఎల్ అత్యధికంగా తెచ్చిన డ్రైవర్లు ఆర్ఎల్ రెడ్డి, వి.రెడ్డప్పలకు క్యాష్ అవార్డు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఔత్సాహిక వ్యాపారవేత్తలకు అవగాహన సదస్సు

మదనపల్లె వన్ డిపో పరిధిలోని ములకలచెరువు బస్టాండులోని ఖాళీ స్థలం లీజు విషయంపై వ్యాపారవేత్తలకు అవగాహన కార్యక్రమం జరిగింది. డీపీటీఓ రాము మాట్లాడుతూ ఖాళీ స్థలాల లీజుకు ఈ నెల 27లోపు టెండర్లు దాఖలు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎం మూరే వెంకటరమణారెడ్డి, ఏఈ లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ అమరవీరులకు ఘన నివాళి



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఐజీ ఏవైవీ కృష్ణ

కలికిరి : సీఆర్‌పీఎఫ్(సీఐఏటీ-3) కేంద్రం 10వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఆర్‌పీఎఫ్ ఐజీ ఏవైవీ కృష్ణ సీఆర్‌పీఎఫ్ అమరవీరుల స్థూపం వద్ద ఘన నివాళులు అర్పించారు. సీఆర్‌పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన రెండవ రోజు వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఆర్‌పీఎఫ్‌లో పాల్గొనే వారికి భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు వీలుగా అత్యుత్తమ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం కేంద్రం ఆవరణలో విస్తృతంగా పర్యటించి, మొక్కలు నాటారు. జవాన్‌లు, అధికారులకు క్రికెట్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బడాఖానా నిర్వహించారు. ఆటల పోటీలలో ప్రతిభ చాటిన వారికి ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ కేంద్రం కమాండెంట్‌లు నీజర్ కుమార్ పాండే, రాజేష్ కుమార్, డిప్యూటీ కమాండెంట్‌లు శివకుమార్ కేజీ, సంజీవ్ వొహ్రా, అమర్‌నాథ్ యాదవ్, ప్రసాద్ కేవీ, అసిస్టెంట్ కమాండెంట్ డాక్టర్ ఏఎస్ శశికాంత్ చిన్నమల్లి, శివసామి, హనుమాన్ రామ్, సీఐఏటీ సిబ్బంది, జవాన్‌లు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిత ప్రశ్నార్థకం



మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి

కురబలకోట : మాదక ద్రవ్యాలతో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని స్పెషల్ రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ కమిషనర్ టి.నాగలక్ష్మి పేర్కొన్నారు. అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం మాదక ద్రవ్యాలపై జరిగిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత మాదక ద్రవ్యాల పట్ల ఆకర్షితులవుతుండడం విచారకరమన్నారు. వీటి నుంచి దూరం చేసేందుకు ఎందరో ఎన్నో విధాలుగా ప్రయత్నిస్తున్నారన్నారు. ఒక సారి మత్తు పదార్థాలకు అలవాటు పడితే అది ప్రాణాలు హరించే వరకు తీసుకెళ్తుందన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో మదనపల్లె ఇన్‌స్పెక్టర్ శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ కళాశాలలు, విద్యాలయాల్లో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా అరికట్టడానికి డ్రగ్స్ నిరోధక కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటి నిరోధానికి యువత సహకరించాలని కోరారు. మోటివేషనల్ స్పీకర్ రామమూర్తి పాల్గొన్నారు.

అంతర్జాతీయ విజేతకు అభినందన



శివానాయక్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

వైవీయూ: ఇటీవల బ్యాంకాక్‌లో నిర్వహించిన ఆసియా పసిఫిక్ యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో విజయం సాధించి బంగారు పతకం కైవసం చేసుకున్న ఎం.శివానాయక్‌కు అభినందన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ ముఖ్య అతిథిగా విచ్చేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థి అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించడం పట్ల సంతోషంగా ఉందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్ మాట్లాడుతూ సాధారణ పేద, మధ్యతరగతికి చెందిన శివానాయక్ అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. కళాశాల ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ టి.హజరతయ్య మాట్లాడుతూ ఒక క్రీడాకారుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం వెనుక దశాబ్దాల శ్రమ, ఎన్నో కష్టాలు, కన్నీళ్లు ఉంటాయన్నారు. ఆసియా పసిఫిక్ యోగా పోటీల్లో స్వర్ణపతకం సాధించిన శివానాయక్‌ను అధ్యాపకులు ఘనంగా సన్మానించి, రూ.5 వేలు నగదు అందజేశారు. అలాగే జాతీయస్థాయిలో రాణించిన పలువురు క్రీడాకారులను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



సుశాంత్, రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టు (106 పరుగులు)



బ్రహ్మసాయితేజారెడ్డి, సౌత్ జోన్ జట్టు (4 వికెట్లు)



మురళి, విశాఖజట్టు (4 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : కడప వేదికగా ఏసీఏ అండర్-19 పురుషుల అంతర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ప్రారంభమైంది. వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన సౌత్‌జోన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసింది. జట్టులోని మన్విత్‌కుమార్‌రెడ్డి 88 పరుగులు చేశాడు. కడప బౌలర్లు ప్రణీవ్ 1, అయూబ్ 1 వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టుకు వర్షం అడ్డంకిగా మారడంతో 37 ఓవర్లలో 195 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగింది. కడప జట్టు 37 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 111 పరుగులు చేసింది. దీంతో రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్టు 83 పరుగుల తేడాతో విజయం సాధించింది.

కేఎస్ఆర్ఎం మైదానంలో : కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో గుంటూరు, రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన గుంటూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 44.3 ఓవర్లలో 180 పరుగుల వద్ద గుంటూరు జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని తౌఫిక్ 53 పరుగులు చేశాడు. సెంట్రల్ జోన్ బౌలర్లు యోచన్‌స్వేతార్క్ 3, గీత్ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు 40.5 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. జట్టులోని అభినవ్ 59 పరుగులు చేశాడు. దీంతో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

కేఓఆర్ఎం మైదానంలో: కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విశాఖపట్నం, రెస్ట్ ఆఫ్ నార్త్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన విశాఖ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి విశాఖజట్టు 270 పరుగులు చేసింది. జట్టులోని ప్రసాద్ 53, వర్ధన్ 61 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ బౌలర్లు లోహిత్ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు 48.1 ఓవర్లలో 222 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని సుశాంత్ 106 పరుగులు చేయగా, పృధ్వీరాజ్ 50 పరుగులు చేశాడు. విశాఖ బౌలర్లు మురళి 4, వర్ధన్ 3 వికెట్లు తీశారు. దీంతో విశాఖపట్నం జట్టు 48 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

మల్లయ్యకొండ హుండీ ఆదాయం లెక్కింపు

తంబళ్లపల్లె : మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయ ప్రధాన హుండీ ద్వారా రూ.4.27 లక్షల ఆదాయం వచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ రవికిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయంలో భక్తులు కానుకల రూపంలో చెల్లించిన ప్రధాన హుండీని చైర్మన్ మల్‌రెడ్డి, ఈవో రమణ, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డిల సమక్షంలో లెక్కించారు. మూడు నెలలకు గానూ రూ.4,27,641ల ఆదాయం వచ్చింది.

ఈ కార్యక్రమంలో పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున, కొండకిట్ట, సహదేవ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

జీవకోటికి సంరక్షణ ఓజోన్ పొర

నేడు అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం



నేషనల్ గ్రీన్ క్రాప్ జిల్లా టీమ్ సభ్యులతో కలిసి లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : సూర్యుని నుంచి వెలువడే అతినీల లోహిత కిరణాలు నేరుగా భూమి మీద పడడంతో సకల జీవరాశులకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. వీటికి రక్షణ కవచంగా ఓజోన్ పొర పనిచేస్తోంది. నేడు పల్లెల నుంచి పట్టణాల వరకు వాహనాలు పెరగడం, పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యం, అధికశాతం మంది ఏసీలను వినియోగించడంతో ఓజోన్‌పొరకు ప్రమాదం పొంచి ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. మానవ తప్పిదంతో పుడమికి రక్షణ కవచంలా ఉండే ఓజోన్ పొర నేడు పలుచబడిపోతోంది.

సూర్యుడి నుంచి వచ్చే అతి నీలలోహిత కిరణాలను అడ్డుకునే ఓజోన్ పొర దెబ్బ తినడంతో ఎండ వేడిమికి తట్టుకోవడం కష్టంగా మారుతుంది. ఈ ప్రమాదాన్ని 1987లోనే మాంట్రియల్ ప్రోటోకాల్' (ఓజోన్ పొర క్షీణతపై జరిపిన పరిశోధన) హెచ్చరించింది. దీంతో 1994 సెప్టెంబర్, 16న ప్రపంచ దేశాలు సమావేశం నిర్వహించి ఏటా సెప్టెంబర్ 16న అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం జరపాలని నిర్ణయించారు.

20 లక్షల మందికి చర్మ క్యాన్సర్

భూ ఉపరితలంపై స్ట్రాటోస్పియర్ ఆవరణలో ఓజోన్ ఉంటుంది. 25 నుంచి 35 కిలో మీటర్ల ఎత్తులో ఎక్కువగా ఆవరించి ఉంటుంది. స్ట్రాటోస్పియర్ ఓజోన్ అతినీల లోహిత కిరణాలను సంగ్రహించుకుంటుంది. క్లోరోఫాం కార్బన్ ఉపయోగించడంతో ఇక్కడ ఉష్ణోగ్రతలు పెరిగి ఓజోన్ పొరకు చిల్లులు పడడంతో అతి నీలలోహిత కిరణాలు భూమిని తాకి నేత్రవ్యాధులు, చర్మ కేన్సర్, ఇతర వ్యాధుల తీవ్రత పెరుగుతుంది. శీతల దేశాలైన న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలలో ఇప్పుడు ఈ ప్రభావం కనిపిస్తోంది. ఓ సర్వే ప్రకారం భూమి మీద 20 నుంచి 30 లక్షల మందికి చర్మ కేన్సర్ ఉన్నట్లు తెలిసింది.

శాస్త్రవేత్తల నిర్ధారణ

మానవాళి అవసరాలకు వాడే అనేక వస్తువుల నుంచి వెలువడే కాలుష్యంతో ఓజోన్ పొరకు ముప్పు ఏర్పడుతోందని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. హేలోన్స్, మిథైల్ క్లోరోఫామ్, మిథైల్ మైడ్, సీఎఫ్‌సీతో ఈ ప్రమాదం ఉంది. ఏరోఫోల్ ఉత్పత్తులు, రిఫ్రిజేషన్స్, స్ప్రేల ఉత్పత్తులను విచ్చలవిడిగా వినియోగించడంతో ఓజోన్‌కు ముప్పు వాటిల్లుతోందని గుర్తించారు. 1993 నుంచి దేశంలో జాగ్రత్తలు తీసుకుని సీఎఫ్‌సీ ఉత్పత్తులు నిలిపివేయాలని సూచించింది. 296 కన్వర్షన్ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. హైదరాబాద్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసిటి) సంస్థ పరిశోధనలు చేస్తోంది. వీరి సూచనతో ప్లాస్టిక్ వినియోగం నిషేధించాలని, ఏసీల వాడకం తగ్గించాలని, అవసరం మేరకే స్ప్రేలు వాడాలని ప్రభుత్వం సూచించింది.

నేడు ప్రతి పాఠశాలలో నిర్వహించాలి

ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవ కార్యక్రమాన్ని శనివారం జిల్లాలోని ప్రతి పాఠశాలలో నిర్వహించాలని డీఈఓ రాఘవరెడ్డి సూచించారు. శుక్రవారం కడపలోని తమ కార్యాలయంలో నేషనల్ గ్రీన్ క్రాపు వైఎస్సార్ జిల్లా టీమ్ మెంబర్స్‌తో కలిసి డీఈఓ లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్ అనే బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఉన్న సైన్సు ఉపాధ్యాయులు ఓజోన్ పరిరక్షణ దినోత్సవం గురించి సమావేశాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్రాప్స్ జిల్లా కో ఆర్డినేటర్ టీవీ రమణయ్య, క్లస్టర్ కో ఆర్డినేటర్లు సాధిక్, సూర్యచంద్ర, శివప్రసాద్, విజయేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చెట్ల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టాలి

మానవాళికి జరుగుతున్న విధ్వంసాన్ని గుర్తించక ముందుకు వెళ్తే కొత్త ప్రమాదం తెచ్చుకున్న వారవుతాం. వ్యర్థాలను సృష్టించే కార్యకలాపాలనన్నింటినీ ఆపి వాటికి ప్రత్యామ్నాయంగా ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకం చేపట్టాలి. ఏసీలు, రిఫ్రిజిరేటర్ల వాడకాన్ని వీలైనంత వరకు తగ్గించాలి.

- బి. మహేశ్వరరెడ్డి, జిల్లా సైన్సు అధికారి